72 గంటల బంద్‌కు పీడీఎస్‌యూ పిలుపు

ముషీరాబాద్: ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలల 72 గంటల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, నాగరాజు కోరారు. జూలై2,3, 4వ తేదీల్లో ఈ బంద్‌ను తలపెట్టినట్లు వారు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు. మంగళవారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

గ్రంథావిష్కరణ



మధుజ్యోతి రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మధుసూదనచారి

చిక్కడపల్లి: ఇనాక్ సాహిత్య సృష్టి సమస్తం సామాజిక దృష్టితోనే ఉంటుందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభలో ఎస్వీయూ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం ప్రారంభ వేడుకను మంగళవారం ఆయన ప్రారంభించారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య మధుజ్యోతి రచించిన 'ఇనాక్ సాహితీ సృష్టి దృష్టి'గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు జనార్దనామూర్తి, ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్, మల్లాది ఉష, గీతాదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.

దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ దేవాలయం నూతన కమిటీని మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎస్.రాజేశ్వరిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వి.సత్యనారాయణ, సతీష్‌యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా అనూప్‌కుమార్, మీనా, రమేష్‌గౌడ్, భానుప్రసాద్, లక్ష్మీ, ఉపాధ్యక్షులుగా ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా రవీందర్‌యాదవ్, కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, ఉత్తమ్, ప్రవీణ్‌కుమార్, ధర్మేందర్‌లు నియమితులయ్యారు. వీరి పదవి కాలం రెండేళ్ల పాటు ఉంటుంది. సలహాదారులుగా అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ రవివెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నాగేష్ ముదిరాజ్, బస్తీ నాయకులు నర్సింగ్‌రావు, జనార్దన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, వీరారెడ్డి, నాగులుయాదవ్ నియమితులయ్యారు.

వైద్యులు రోగులను మానవత్వంతో చూడాలి

చిక్కడపల్లి: వైద్యులు దేవుడితో సమానమని రోగులను ప్రేమ మానవత్వంతో చూడాలని కార్పొరేటర్ పావని అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని నర్మద నర్సింగ్‌హోమం డైరెక్టర్ డా. విజయకుమార్‌ను కలిసి మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా 4 దశాబ్దాలుగా అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందిస్తున్న డా.విజయకుమార్ ఆదర్శమని అన్నారు. అదే విధగా ప్రముఖ వైద్య నిపుణులు డా.జయరాంరెడ్డి, డా.వెంకటరమణను సన్మానించి డాక్టర్ డే శుభాకాంక్షలు తెలిపారు.

మున్నూరుకాపులకు మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలి

కాచిగూడ: రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బీసీ జనాభాలో అత్యధిక జనాభా కల్గిన మున్నూరుకాపుకు చెందిన ఒక్కరు కూడా ప్రస్తుత మంత్రివర్గంలో లేకపోవడంతో మున్నూరుకాపులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. మున్నూరుకాపు సంఘం పటేల్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఆర్‌వీ మహేందర్‌కుమార్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం ఆయనకు మున్నూరుకాపులు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీజేపీ అధ్యక్షుడిగా రాంచందర్ రావు నియామకం హర్షణీయం

నల్లకుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.రాంచందర్‌రావు నియామకం హర్షణీయమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. మంగళవారం బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన రాంచందర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి వారు శుభాకాంక్షలు తెలియజేసింది. విద్యార్థి దశలో ఏబీవీపీ కార్యకర్తగా అంకితభావంతో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన రాంచందర్‌రావు నియామకం బ్రాహ్మణ జాతికి గర్వకారణమని అన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా గీతామూర్తి

కాచిగూడ: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, పార్టీ సంస్థాగత ఎన్నికల కో రిటర్నింగ్ అధికారిణి కె.గీతామూర్తిని జాతీయ కౌన్సిల్ సభ్యులుగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఆమె పార్టీ జాతీయ రిటర్నింగ్ అధికారిణి, కేంద్రమంత్రి శోభ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నారు. అనంతరం గీతామూర్తి మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఇక పకడ్బందీగా..

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు

• పారిశుద్ధ్య విభాగం నుంచి ఆస్తిపన్ను విభాగానికి వసూలు బాధ్యత • ఆస్తిపన్ను వసూలు చేసినట్లే ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూలుకు సన్నద్ధం

వ్యాపార సంస్థల ట్రేడ్‌లైసెన్స్ జారీ, వాటి ఫీజుల వసూలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు జీహెచ్ఎంసీ సన్నద్ధమవుతోంది. గతంలో ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు, జారీ ప్రక్రియను పారిశుద్ధ్య విభాగం చూసుకునేది. ఇకపై ట్రేడ్‌లైసెన్స్‌ల అంశాన్ని ఆస్తిపన్ను వసూలు చేసే విభాగం చూసుకోనుంది. ఇకపై ఆస్తిపన్ను వసూలు చేసినట్లే ట్రేడ్‌లైసెన్స్‌ల ఫీజును వసూలు చేయాల్సి ఉంటుంది.



జీహెచ్ఎంసీ సర్కిల్‌-16 కార్యాలయం

ఈ సర్కిల్ పరిధిలో ఒక చదరపు ఫీట్‌కు రూ.6-13..

చదరపు ఫీట్ చొప్పున ట్రేడ్‌లైసెన్స్ ఫీజు ఉంటుంది. సర్కిల్ పరిధిలో ఒక చదరపు ఫీట్‌కు రూ.6 నుంచి రూ.13 ఉంది. ఆయా ప్రాంతాలను బట్టి ట్రేడ్‌లైసెన్స్ ఫీజు ఉంది. కొత్త ట్రేడ్‌లైసెన్స్ పొందాలనకునే వారు స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పిస్తే తక్షణమే ట్రేడ్‌లైసెన్స్ జారీ చేస్తారు.

అంబర్‌పేట: అంబర్‌పేట సర్కిల్ పరిధిలో రూ.43 కోట్ల మేరకు ట్రేడ్‌లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు కేవలం రూ.3కోట్లు మాత్రమే వసూలు చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి మిగిలిన రూ.40కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ప్రస్తుత ఏడాది, పెండింగ్ ట్రేడ్ లైసెన్స్ ఫీజులతో పాటు వాటిపై వడ్డీ, కొత్తవి జారీ చేస్తూ సర్కిల్ యంత్రాంగం లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంటుంది.

సర్కిల్‌-16 పరిధిలో 17,225 వ్యాపార సంస్థలు...

జీహెచ్ఎంసీ సర్కిల్‌-16 పరిధిలో అంబర్‌పేట నియోజకవర్గంతో పాటు హిమాయత్‌నగర్ డివిజన్ వస్తుంది. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ యంత్రాంగం 17,225 వ్యాపార సంస్థలు ఉన్నట్లు గుర్తించింది. సర్కిల్ పరిధిలో 68,706 నిర్మాణ భవనాలు ఉన్నాయి. వాటిలో 17,225 వ్యాపార సంస్థల ఉన్నట్లు తేల్చింది. మరిన్ని వ్యాపార సంస్థలు ఉన్నా వాటిని అధికారులు ఇప్పటి వరకు గుర్తించ లేదు. గుర్తించిన వ్యాపార సంస్థల నుంచే ట్రేడ్‌లైసెన్స్ ఫీజును రూ.43 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది. మరన్ని గుర్తిస్తే జీహెచ్ఎంసీకి మరింత ఆదాయం వచ్చే ఆవకాశం ఉంది.

ట్రేడ్‌లైసెన్స్ తప్పించుకుంటున్న వ్యాపార సంస్థలు...

సర్కిల్ పరిధిలో పక్కా వ్యాపారాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ పొందకుండా దాని ఫీజులను తప్పించుకుంటున్నారు. ప్రధానంగా సర్కిల్ పరిధిలో పెద్ద పెద్ద భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టల్ వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ లేకుండా దర్జాగా వ్యాపారాలను సాగిస్తున్నారు. హిమాయత్‌నగర్, నారాయణగూడ, కాచిగూడ, బర్కత్‌పుర, నల్లకుంట తదితర ప్రాంతాల్లో ఉన్న మెజార్టీ హాస్టళ్ల నిర్వాహకులు ట్రేడ్‌లైసెన్స్‌లు లేకుండానే కొనసాగిస్తున్నారు. వీరిని గుర్తించడంలో జీహెచ్ఎంసీ అధికారులు విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా వసూలు..

సర్కిల్ పరిధిలో నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ట్రేడ్‌లైసెన్స్ ఫీజును వసూలు చేస్తాం. ప్రతి వ్యాపార సంస్థ యాజమాని విధిగా ట్రేడ్‌లైసెన్స్ పొంది నిర్ణయించిన ఫీజు సకాలంలో చెల్లించాలి. లేనిపక్షంలో అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ట్రేడ్‌లైసెన్స్ జారీ ప్రక్రియ, ఇతర ఇబ్బందులు ఉంటే నేరుగా నన్నే సంప్రదించండి. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటాను.

– మారుతీదివాకర్, సర్కిల్‌-16 డీఎంసీ

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జె. వెంకటేష్ మాట్లాడుతూ... జనవరి 1,2023 నుంచి రావాల్సిన 2 పీఆర్‌సీలను 51 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించి అమలు చేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన, సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ట్రెజరీ ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని తీసుకురావాలని కోరారు.

◆ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు జీవో 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జీవో 142ను రద్దు చేసి... కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 104 సిబ్బందిని సర్దుబాటు చేసి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రులకు డెటా ఎంట్రీ ఆపరేటర్ హోదా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్, అధ్యక్షుడు ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదనాయక్, కోశాధికారి కవిత, వివిధ సంఘాల నాయకులు కృష్ణమూర్తి, గిరి యాదయ్య, సుమన్ ,రాజశేఖర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: సింగాడి కుంటలోని రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, వల్లాల శ్యామ్‌యాదవ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నీలం వేణుయాదవ్, ప్రభాకర్, జి.వెంకటేష్, పరిమల్ కుమార్, ఎంసీ మహేందర్‌బాబు, దిలీప్‌యాదవ్, బస్తీవాసులు శ్రీనివాస్, రాము, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌కు బెస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ డిస్ట్రిక్ 320హెచ్ అవార్డు



బెస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ డిస్ట్రిక్ 320హెచ్ అవార్డు అందుకుంటున్న శేరిపల్లి గణేష్ పద్మశాలి

కవాడిగూడ: లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ క్లబ్ అధ్యక్షుడు శేరిపల్లి గణేష్ పద్మశాలికి బెస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ డిస్ట్రిక్ 320హెచ్ బెస్ట్ క్లబ్ ది డిస్ట్రిక్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శేరుపల్లి గణేష్‌కు 320హెచ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్.మనోహర్‌రెడ్డి మంగళవారం ఈ అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. లయన్ శేరుపల్లి గణేష్ తన పదవి కాలంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పన కోసం ఇందిరాపార్కు చౌరస్తా, గాంధీనగర్ చిక్కడపల్లిలో ఓకేషనల్ ట్రెనింగ్ సెంటర్లను ప్రారంభించి అనేక మందిని ఆదుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా తనకు అవార్డులను ప్రధానం చేసిన సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ కమాలకర్ ముస్కాల, సభ్యులకు శేరిపల్లి గణేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాద్ గుప్తా, అశోక్ రైస్, కల్లూరి శ్రీనివాస్, మదు, ప్రకాష్, రాంమూర్తి, విజయేందర్‌రెడ్డి, సుమన్ హారిక, సునిత, విద్య, టీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించినప్పడే గుర్తింపు



డా. మనోజ్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి డా. వెంకటి

ముషీరాబాద్: ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకొని మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డిని జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ఆస్పత్రికి వచ్చే వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ.. వైద్యం అందించినప్పుడు ఆదరణ పెరుగుతుందన్నారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ప్రాంగణంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ, ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ, యూఎఫ్ఓఆర్‌డబ్ల్యూఏ ఆధ్వర్యంలో డా.మనోజ్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు ఇందిరా, శివరాణి, యూఎఫ్ఓఆర్‌డబ్ల్యూఏ కార్యదర్శి సయ్యద్ ఖలీద్‌షా, డ్రగ్ వాచ్ టీమ్ కన్వీనర్ శ్రీలత, శాంతి కమిటీ సభ్యురాలు మణీలా, విజయలక్ష్మి, యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు విజయకుమారి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జి.రచన శ్రీ

కవాడిగూడ: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ క్రీడాకారులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమ అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని కోరారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీల్లో మొత్తం 8 టీమ్‌లు పాల్గొంటాయని ఆమె తెలిపారు. ఫైనల్ మ్యాచ్ ఈనెల 3న ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, నాయకులు ఎం.రమేష్‌రామ్, జి.వెంకటేష్, పరిమల్‌కుమార్, సలంద్రి దిలీప్‌యాదవ్, మహేందర్ బాబు, బొల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి డా.రాంరెడ్డి సేవలు ఎనలేనివి



జీసీపీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంరెడ్డిని సన్మానిస్తున్న కాలేజీ సిబ్బంది

కవాడిగూడ: ప్రభుత్వ వ్యాయామ విద్య కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కుంభం రాంరెడ్డి రాష్ట్రంలో క్రీడా రంగానికి ఎనలేని సేవలు అందించారని రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు, మాజీ ఎంపీ డా. జితేందర్‌రెడ్డి అన్నారు. దోమలగూడ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (జీసీపీఈ) ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘకాలం సేవలు అందించిన డాక్టర్ రాంరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం కాలేజీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంరెడ్డికి పలువురు ఎమ్మెల్యేలు, క్రీడారంగ ప్రముఖులు, క్రీడా శిక్షకులు హాజరై సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. రాజారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు, విజయసాగర్, డా. సంధ్యశ్రీ, గోవర్ధన్‌రెడ్డి, శివరాజు, జగన్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య నిర్లక్ష్య వైఖరి వల్లే సిగాచి కెమికల్ ప్రమాదం

ముషీరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో 45 మందికి పైగా కార్మికులు మృతి చెందడానికి యాజమాన్య నిర్లక్ష్య వైఖరే కారణం అని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. మరణించిన కార్మికులకు, ఉద్యోగులకు రూ.5కోట్ల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుల పిల్లలకు విద్యను అందించాలన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. యాజమాన్యంపై కేసు నమోదు చేసి దుర్ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యుగంధర్‌కు ఆస్కార్ అకాడమీలో సభ్యత్వంపై హర్షం



కాచిగూడ: ప్రముఖ సినీ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ యుగంధర్ తమ్మారెడ్డికి ఆస్కార్ అకాడమీలో సభ్యత్వం లభించడం పట్ల తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ), తెలంగాణ మేధావుల ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీసీసీ అధ్యక్షుడు డా. రాజ్‌నారాయణ ముదిరాజ్, న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు, మేజర్ డా. జయసుధ, డా. అశోక్, ప్రొ. మహ్మద్ అక్తర్‌ఆలీ, యోగా గురువు యూవీ నాగలక్ష్మి తదితరులు యుగంధర్ తమ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. యుగంధర్ తమ్మారెడ్డి అంకితభావం, అద్వితీయ పనితనం వల్ల అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌-2025 క్లాస్‌లో సభ్యత్వం పొందారు. ఈ అరుదైన గౌరవం సాధించిన ఆయన, తెలుగు సినిమా పరిశ్రమకు గర్వకారణంగా నిలిచారు.

నేటి తరానికి ఓంకార్ జీవితం ఆదర్శనీయం



మద్దికాయల ఓంకార్ జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో మంగళవారం ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు, సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్తమాన రాజకీయాలలో ఓంకార్ జీవితాన్ని వారి త్యాగాన్ని, కమ్యూనిస్ట్ పార్టీలో అనుసరించాలన్నారు. భద్రచలం రాజధానిగా గోదావరి లోయ పరివాహక అటవీ ప్రాంతం మొత్తాన్ని ఆదివాసీ ప్రాంతంగా పరిగణించి స్వయం పాలనా అధికారం కల్పించాలని ఆయన చేసిన పోరాటం చరిత్రాత్మకమని అన్నారు. నేటి తరానికి మద్దికాయల ఓంకార్ జీవితం ఆదర్శనీయమని అన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్నే అర్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, తెలంగాణ కార్యదర్శి గాదగోని రవి, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నాగయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు నాగయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే డాక్టర్ నాగయ్య డాక్టరేట్ పొందడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం డాక్టరేట్ పొందిన నాగయ్యకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్యను ఎమ్మెల్యే సత్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా మారినప్పుడే వృత్తికి న్యాయం చేయగలరని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు నాగయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం డా. నాగయ్య మాట్లాడుతూ.. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఉపాధ్యాయుడిగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ పూర్తి చేశానన్నారు. డాక్టరేట్ పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మీనాకుమారి, పావన, యూటీఎఫ్ నేత దేవాదాస్, ఉపాధ్యాయులు జానీ, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



బర్కత్‌పుర శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బర్కత్‌పురలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను కూడా చూసుకోవాలని ఆయన సూచించారు. మొక్కలతోనే పర్యావరణం పచ్చదనంతో నిండుతుందని, పర్యావరణం పచ్చదనంగా ఉంటేనే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో అటవీ భూభాగం తగ్గిపోతుందన్నారు. దీంతో అనేక వినాశనాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో అందరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. చెట్లే ప్రాణులకు జీవనాధారమ అన్నారు. అలాంటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రధానంగా విద్యార్థులు స్వచ్ఛందంగా మొక్కలు నాటి, సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రుబీనా, డీన్ రమేష్, అధ్యాపకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

నల్లకుంట: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. మంగళవారం ఈస్ట్‌జోన్ పరిధిలోని సీతాఫల్‌మండి మోడల్ హైస్కూల్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు – నివారణ'అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు అసలే నడపొద్దని సూచించారు. హెల్మెట్ ధరించడం, నియమిత వేగంలో వాహనాన్ని నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం చాలా తక్కువని పేర్కొన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఉంటాయని తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కేసులు..

◆ బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపడం నేరమని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారు ఇతరుల ప్రాణాలకు సంకటంగా మారుతున్నారని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సీహెచ్.శ్రీనివాసులు, నల్లకుంట ట్రాఫిక్ ఎస్సై దేవదాసు, బేగంపేట టీటీఐ సిబ్బంది కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.